
# గొడుగు




మడవనూరి సుబ్రహ్మణ్యం

గొడుగు కొనాలన్న నా ఆశ ఈనాటిది కాదు. ఎప్పుడో పెళ్ళప్పుడు అత్తగారిచ్చిన 'కాశీయాత్ర' గొడుగు ఐదేండ్ల క్రితం రెప్పైరయ్యి అటకఎక్కి కూర్చుంది మూలపడిన ముసలిదానిలా. నా హెడ్‌క్లర్క్ జీవితం మరో నాలుగేళ్ళలో ముగియబోతూంటే, నా కంటే ముందే అది ఉడిగిపోయింది. అప్పట్నుంచి క్రొత్తది కొనాలనుకుంటూనే వున్నాను. కానీ వీలుపడ్డంలేదు. వచ్చే జీతం కటాకటిన సంసారానికి సరిపోతే చాలనిపిస్తుంది.

ఇంట్లో రోగిష్ఠి భార్య మందులకు, తోటకూర కాడల్లా పెరిగి, పెళ్ళీడుమించిన ఇద్దరమ్మాయిల అలంకారాలకు, కాలేజి చదువు వెలగబెట్టే ఓ మగవెధవ బిల్లాలకు, అంతేగాక తిరుపతిని సందర్శించే బంధుకోటి (భక్తకోటి) మర్యాదలకు, ఇంటి ఖర్చులకు పోగా మిగిలేది చిల్లుపడిన ఖాళీ జేబు, వేడి నిట్టూర్పులూను. గొడుగు కొనడం మాట అలావుంచి, మాసిక లేసిన షర్టులకు బదులు క్రొత్త చొక్కా తీసుకుందామంటే పడటంలేదు.

లైఫ్ ఇన్సూరెన్స్ అని, బ్యాంక్‌లోనని, ప్రావిడెంటు ఫండని, ఇదని, అదని పోగా వచ్చే జీతం ఆరొందలు ముప్పయి రోజుల జీతం ముప్పయి నిముషాలైనా నిలువదు జేబులో. మొదటి తారీఖున, జీతంతో వస్తుంటే, వచ్చే దారిలో— నెలంతా తెచ్చిన ఇంటివెచ్చాల పద్దుపుస్తకం చేతిలో వుంచుకుని, ఆంజనేయులుశెట్టి పళ్ళికిలిస్తూ కనిపిస్తాడు. ఎంతో వినయంగా నమస్కరించి, (మరో రోజైతే ముఖం చిట్లించుకుంటాడనుకోండి!) పద్దుపుస్తకం ముందరేస్తాడు. బాకీ తీర్చి బయటపడి, ఎదురుగా మందులకొట్లోకి వెళ్ళి, డాక్టరు రాసిచ్చిన పట్టీలో అవసరమైనవి మాత్రమే కొని, (డబ్బులు చాలవు కనుక నాదృష్టిలో కొన్ని అనవసరమైనవే మరి!) మిగిలిన పైసల్తో ఇంటికొచ్చిపడితే 'ధనియాల కాఫీ'మాత్రమే ప్రాప్తం. రాత్రికి చారన్నం వరకే పరిమితం. ఇంట్లో అన్నీ నిండుకున్నాయన్న విజాన్ని కూతుర్లు పదే పదే ఈ విధంగా గుర్తు చేస్తారు.

ఏదో తిని, తిరిగ్గా కూర్చుని, ప్రక్కింటి నుండి తెచ్చిన పేపరు (నాకు పేపరు కొనే తాహతు ఎక్కడిది?) చదువుదామనుకుంటే ఆరోజు కరెంటు వుండదు తెల్లవార్తూనే కరెంటు బిల్లు కట్టాలనడానికి అది సంకేతం. ఇక. రోజూ ప్రొద్దెక్కందే రాని పాలవాడు, జీతం అందిన మరుసటిరోజు మాత్రం, వేకువనే వచ్చేస్తాడు. నిత్యంతెచ్చే పాల (నీళ్ళపాల)లా కాక, చక్కగా సుప్రభాతం పలుకుతూ, చిక్కటి పాలు పోస్తాడు. వాడికి డబ్బిచ్చి పంపించేసి, స్నానం - సంధ్య గావించి, కరెంటు బిల్లు కట్టటం కోసం మగవెధవని అడుక్కుంటే, కమిషన్ లేందే 'క్యూ'లో నిలబడనంటాడు వాడు. (నామాట ససేమిరా వినడు కాబట్టి కొడుకైనా 'వెధవా'ని అనాల్సొస్తోంది. మరోలా భావించకండి!) ఇక, ఒక అమ్మాయిని కిరసనాయిల్ క్యూలోనూ, మరొకమ్మాయిని చక్కెర క్యూలోను, నిలబెట్టక తప్పదు బజార్లో వెకిలి వెధవల మొరటు చేష్టలను చూస్తూ ఊర్కోమని, వాళ్ళను ప్రాధేయపడి పంపక తప్పదు. ఆఫీసు వదలగానే ఖాతా తీసుకుని, ఆ సాయంత్రం ఆంజనేయులు శెట్టి కొట్టుకెళ్తే, అరువు బేరం అని ఓ చిన్నచూపు చూసి, ఆరునొక్కరాగం ఆరాటపడుతూ తీసి, అర్ధగంటక్కాని ప్రసన్నంకాడు.

ఇన్ని ఖర్చులు, ఇన్ని బాధలు పడి, మూడవరోజు (జేబు)చూసుకుంటే మిగిలేది (మిగుల్చుకుంటే) ఇరవయ్యో ముప్పయ్యో! ఇక గొడుగు నేనెలా కొనను?

కూతుర్లు, తమను నెలకొక సినిమాకైనా పంపలేదని, పెళ్ళయ్యుంటే తమ భర్తలతో ఎంచక్కా వెళ్ళేవాళ్ళమని నిష్ఠురపడ్డినా, తనకు పేకెట్ (పేకాట) మనీ ఇవ్వలేదని కొడుకు అలిగినా, భార్య తన రోగానికి సరిగ్గా మందులు తేలేదని నిందించినా, చూస్తూ ఊర్కోవడం తప్ప నేను చేయగల్గిందేమీ లేదు.

కాకపోతే నా అసమర్థత, అన్నిటికి కారణమని వారందరి వాదన. నేను 'లంచం' పుచ్చుకుంటే అందరూ హాయిగా బ్రతుక వచ్చునని వారి అభిప్రాయం. వారి వాదనలో కొంత నిజం లేకపోలేదు. నేను 'ఊ' అంటే నా 'షేర్' ప్రకారం నా సీటును బట్టి (స్టేటస్‌ను బట్టి) రోజుకు పదో పరకో నాకు ముట్టకపోదు. ఐనా లంచం తీసుకోవడం నా కిష్టంలేదు. మాఆఫీసులో టేబుల్ పైన పెట్టబడే 'బరువు'లు, టేబుల్ క్రిందనుంచి వచ్చే 'ఆమ్యామ్యాలు' లోయర్ డివిజన్ కర్క్ లోకనాథం దగ్గర్నుంచి, చీఫ్ క్లర్క్ చిదానందాన్ని చిద్విలాసంగా చేరి, డిస్పాచింగ్ క్లర్క్ దామోదరం వద్దకు వస్తాయి. మధ్యలో నే నొకణ్ణి అడ్డు కనుక ప్రక్కసీటు స్టెనో శకుంతల ద్వారా ఆఫీసర్ ఆనందరావు గదిలోకి రయ్యిమని దూసు కెళ్తాయి. ఆఫీసర్ అప్రూవల్ కాగానే– గుమాస్తా గుర్నాథం ద్వారా గ్రేడ్ ప్రకారం, విభజింపబడి, అందరికీ పంచి పెట్ట బడుతుంది.

ఇక ఎవరికి వారు స్వహస్త లాఘవంతో తీయని మాటల్తో, పార్టీల దగ్గర్నుంచి టీలు, టిఫిన్లూ పార్టీలు (వెట్)లాగుతూనే వుంటారు. కాని నాకు మాత్రం ఇదంతా ఓ రోతలా అనిపిస్తుంది. చూస్తూ వూర్కోడం తప్పనిచ్చి మరేం చేయలేను. అక్కడికీ, ఓమారు ఇలాటి అన్యాయాన్ని వేలెత్తి చూపినందుకు, అందరూ కల్సి వాపైనే లంచం తీసుకున్న నేరాన్ని మోపి డిప్రమోషన్ చేయించారు. నా వేలిని నేనే కొరుక్కునేలా చేశారు. లేకపోతే నేను ఆఫీసర్నయుండేవాణ్ణి ఈవేళకి.

మా యింట్లో రోజుకు ఒక్కసారైనా గొడవ జరుగుతుంటుంది దీన్ని గురించి. ఇంటావిడ ఎప్పుడూ సాధిస్తూనేఉంటుంది– ఏదో వేన్నీళ్ళకు (జీతానికి), చన్నీళ్ళు (లంచం) కలిస్తే, మామూలు గొడుగే కాదు బంగారు గొడుగు చేయించుకో వచ్చునని. అయినా నాకు పాపపు సొమ్ము తిని అరగించుకునే శక్తిలేదు, ఉద్దేశ్యమూ లేదు. లంచం తీసుకోనంత మాత్రాన ఏలాగో గొడుగు కొనలేనని కాదు. ఏ పాతికో, ముప్పయ్యో మిగుల్చుకోవచ్చు. కాకపోతే అది ఏ అత్యవసర ఖర్చుకు ఆదుకుంటుందని ఆశ! ఐనా అది బంధువుల తాంబూలాల్లో పెట్టే రవిక్గుడ్డక్కో, రిక్షా చార్జీకో అయి పోతుంటుంది (అప్పన్నండి! అవి మాత్రం అర్జంటు ఖర్చులు కావూ!)

*　　*　　*


ఆరోజు మధ్యాహ్నం మూడుగంట లయ్యుంటుంది. బయట జోరుగా వర్షం. ఆఫీస్ స్టాఫ్ అందరూ ఒక్కొక్కరే గొడుగులు పట్టుకుని ప్రక్కనే వున్న క్యాంటిన్‌కు వెళ్తున్నారు. స్టెనో శకుంతల నావైపు ఓసారి నిర్లక్ష్యంగా చూసి, గొడుగు పట్టుకుని తనూ బయల్దేరింది. నేను స్ట్రిక్ట్‌గా వుంటానని, తనని డిసిప్లెన్డ్‌గా వుండమంటానని, మగవాళ్లతో అనవసరంగా మాట్లాడితే, చనువుగా ప్రవర్తించితే ఆమె తల్లితండ్రులకు చెబుతానని కోపం. అందుకే నాకు గొడుగు లేదని తెల్సినా మాటవరుసకైనా పిలవకుండా వెళ్లిపోయింది. ఐనా ముసలివాడి ప్రక్కన గొడుగులో నడవడం ఆమెకు నామోషీ కదా! చిన్నగా నవ్వుకున్నాను ఆమె ప్రవర్తనకు. ఎవర్నీ గొడుగు కోసం యాచించ దల్చుకోలేదు. నాలుగవుతోంది గంట. నాకు తలనొప్పి ప్రారంభమైంది. మూడుపూట్లా టీయో, కాఫీయో లేందే ఇదో బాధ నాకు. క్యాంటిన్ కెళ్ళిన అందరూ తిరిగి వచ్చేశారు. ఇంకా వాన తగ్గలేదు. తలనొప్పితో ఏం చేయడానికి పాలుపోలేదు. ఫైళ్ళన్ని మూసి తల పట్టుకూర్చున్నాను. అందరూ నాకేసి చూసి, ముసి, ముసిగా నవ్వుకుంటున్నారు.

ఇంతలో గుమాస్తా గుర్నాథం ఆఫీసర్ గది నుండి బయటకొచ్చాడు. వాడి చేతిలో ఫ్లాస్క్ వుంది. నా బాధను గమనించి నట్టున్నాడు. "సార్! మీరు టీ తాగలేదులా వుంది. ఇందులో ఒక కప్పు వుంది త్రాగండి" అంటూ ఇచ్చాడు. నేనంటే వాడికి వల్లమాలిన అభిమానం. "మీలో ఒక్కచెడ్డగుణంకూడాలేని మహానుభావులు. ఈ యుగంలో వుండాల్సిన వారు మాత్రం కాదు." అని ఎన్నోసార్లు పొగిడాడు కూడా. అలాటివాడు ఇస్తే తీసుకోకుండా వుండలేక పోయాను.

టీ త్రాగుతూంటే "మీరూ ఓగొడుగు కొనుక్కోండి సార్!" అని చల్లగా సలహా యిచ్చాడు.

"అవునోయ్! కొనాలి. ఈనెల జీతంలో తప్పక కొనేస్తాను. ఎలాగు ఓవర్ టైం అలవెన్సు కూడా వస్తూంది" అన్నాను ధీమాగా.

ఆ సాయంత్రం జీతాలందాయి. ఇంటి కెళ్లివచ్చి గొడుగు తీసుకోవచ్చని, నేరుగా ఆఫీసునుంచే ఇంటి కెళ్ళాను. అక్కడ పెద్ద హడావుడి జరుగుతూంది. ప్రక్కింటి నుంచి యాభై రూపాయలు బదులు తెచ్చారట. స్వీటు, కారం తయారు చేశారు. మా పెద్దమ్మాయిని అలంకరించారు. పొరుగింటి కుర్చీలను అందంగా అమర్చారు. మరో యింటి నుండి ఎలక్ట్రిక్ బల్బులు తెచ్చి తోరణాల్లా కట్టారు. అక్కడున్న సామగ్రిలో



## అప్పు లభించును

రు. 20,000 లు అంతకు మించి, సరళమైన వడ్డీ మరియు సులభ వాయిదాలపై భవనములు, భూములు, షాపులు, పారిశ్రామిక యూనిట్సు, మిల్లులు, థియేటర్సు, ప్రయివేటు లిమిటెడ్, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు, ఓనర్‌షిప్ బ్లాకుల హామీలపై లభించును. వ్రాయండి లేదా నేరుగా సంప్రదించండి.

SUPREME CORPORATION (Bankers)

F. 15, 'EVEREST' 7th Floor, Near Famous Cine Laboratory,
Tardeo Road, BOMBAY-400034, Phone : 385126.




# గొడుగు

చాలవరకు ఇరుగింటి, పొరుగింటి వాళ్ళదే ఐనా, ఒక్కందుకు నేను గర్వపడుతాను. ఇల్లుమాత్రం నా స్వంతం. స్వార్జితతో నేను చక్కగా కట్టించినది బాడుగ బాధలేవు. ఇంట్లో అడుగుపెట్టిన నాకు అది నా ఇల్లేనా అన్పించింది "ఏమిటబ్బా ఈ తతంగం?" అని ప్రశ్నించాను.


"మనమ్మాయికి పెళ్ళిచూపులండి నిన్న విజయవాడనుంచి, మన ఏడు కొండలస్వామి దర్శనానికి వస్తామన్న బంధువులు, ఈరోజు వస్తామని ఉత్తరం రాశారు మధ్యాహ్నం అందింది అందులోవారు ఏంరాశారో తెల్సా! వాళ్ళబ్బాయి ఒకతను మనమ్మాయిని పెళ్ళిచూపులు చూట్టానికి ఒప్పుకున్నాడుట." అంటూ సంతోషంగ చెప్పింది నా ఆవిడ. ఓవర్ టైం అలవెన్సులో గొడుగుకొనాలన్న ఆశ కాస్తా అడుగంటి పోయింది. పోతే పోయిందిలే, అమ్మాయికి పెళ్ళి కుదిరితే అదే పదివేలని స్వామికి మొక్కుకున్నాను.

ఇటు మధ్యాహ్నపు ఎండ, అటు సాయంత్రం కురిసే వాన, చూస్తుంటే గొడుగుంటే ఎంత సౌకర్యమో! అని అన్పిస్తుంది. కాని డబ్బంతా ఖర్చయిపోయింది. ఏం చేయను? వానకు తడిసి, ఎండకు ఎండే కుక్కలా ఐపోయింది నా బ్రతుకు

ఆఫీసు నుంచి వస్తుంటే చినుకులు ప్రారంభమయ్యాయి. నడిబజార్లోకొచ్చేసరికి పెద్దగా కురవనారంభించింది. పక్కనే వున్న షాపులోకి వెళ్ళి తల దాచుకున్నాను ఇంతలో ఓ కుక్క పూర్తిగా తడిసి నా ప్రక్కనేవచ్చి నిలబడింది చలికి వణకుతు. ఎప్పుడో విన్న సామెత గుర్తొచ్చింది నాకు. చలి పుట్టినప్పుడల్లా కుక్క అనుకుంటుందిట ఓ దుప్పటి కొనేయాలని; నేననుకున్నట్లు – వానొచ్చినపుడల్లా గొడుగు కొనాలని ఆ కుక్కను చూస్తే జాలి కల్గింది. ఎవర్ని ఏమి అడగలేని మూగ జంతువు. దానికి జల్లు పడకుండా వానకు అడ్డంగా నిల్చున్నాను. ఇంతలో షాపు యజమాని వచ్చి, కర్రతో దాని తుంటిపై బాదాడు 'వెధవకుక్క'అని ఈసడించుకుంటూ. అది 'కుయ్యో! కుయ్యో!' మంటూ వానలోకి పరుగెత్తి

పోయింది. నాకు అయ్యో! అన్పించింది. 'వెధవ మనుషుల'ని నన్ను కూడా తిట్టుకుని వుండవచ్చు 'మనసులో' అనుకున్నాను.

యధాలాపంగా షాపును కలియజూశాను! ఓ మూల అందంగా అమర్చిన గొడుగులు, వీర సైనికుల్లా నిలబడి వున్నాయి. అవి నన్ను చూచి నవ్వుతున్నట్టనిపించింది. అందులో ఒకటైనా నాదైతే ఎంత బాగుణ్ణు? జేబు చూసుకుంటే లోగాభై పైసలు మాత్రమే వుంది. యాభై పైసలకు, గొడుగు ఖరీదుకు నక్కకు, నాలోకానికి వున్నంత దూరం.



వాడండి ముఖ్యంగా అలసటకు.
SEALED PACKING 10, & 14 TABLETS
AVAILABLE AT ALL CHEMISTS
Mfrs. SEENU & Co., MADRAS-21

74 సం.గా అఖండ ఖ్యాతిగాంచిన
నారసింహలేహ్యం
రిజిష్టర్డు ట్రేడ్‌మార్కు
అన్ని రకములైన (ముఖ్యముగా పురుషుల) బలహీనతలను పోగొట్టి రక్త వృద్ధిని, పుష్టిని కలిగించు వాజీకరము.
1 డబ్బా రు. 7—25 పోస్టేజి ప్రత్యేకము.
పి. శి. ఏ. అండ్ కో.,
పెదివేవి 523273 (ప్రకాశం జిల్లా)
క్యాటలాగు ఉచితము. కోరినవారికి ఏజన్సీలు ఇవ్వబడును.



ఆంధ్రప్రదేశ్‌లో ఏజన్సీలు ఇవ్వబడుచున్నవి.

VIJAY : MPM

# గొడుగు

నా చూపుల భావం గ్రహించినట్టు "సార్! మీకు గొడుగు కావాలా సార్!" అడిగాడు షాపు యజమాని. "అబ్బే! వద్దు బాబు వాన రాదని నా గొడుగు ఇంట్లో పెట్టి వచ్చాను! ఊర్కే చూస్తున్నాను" అని అబద్ధమాడాను. మాట్లాడకపోతే, అన్ని గొడుగులు తీసి ముందేసేలా వున్నాడు. ఇంతలో వర్షం తగ్గింది. ఇంటికి బయల్దేరాను.

* * *

వెంకటాచలపతి చలవ వల్ల మా అమ్మాయి పెళ్ళి కుదిరింది. కట్నం తీసుకోనన్నాడు పెళ్ళికొడుకు. ప్రావిడెంట్ ఫండు డ్రా చేశాను. నిరాడంబరంగా పెళ్ళి చేసెయ్యాలనుకున్నాను. ఈ పెళ్ళిలోనైనా అల్లుడికిచ్చే కాశీయాత్ర గొడుగుతో బాటు, నేమో ఓ గొడుగు కొనేయాలనుకున్నాను.

పెళ్ళికవారంవుందనగా ఇంట్లో అందరం కల్సి పెళ్ళిసామానులకని సాయంత్రంగా బజారు వెళ్లాం. అవీ కొన్నతర్వాత, గొడుగుల షాపుకెళ్ళి, రెండు గొడుగులు కొనేశాను. నాకు ఎవరెస్టు శిఖరాన్ని ఎక్కినంత ఆనందమైంది. చంద్రమండలం సందర్శించినంత సంతోషమైంది. ఇంకా చెప్పాలంటే, కొడుక్కి ఉద్యోగం వచ్చినంత, నా భార్య సంపూర్ణ ఆరోగ్యవంతురాలైనంత, నేను ఆఫీసరైనంత ఆనందం పొందాను. వాన లేకపోయిన, రాత్రి ఎనిమిదవుతున్నా, గొడుగు పట్టుకుని నడవ సాగాను. మా వారంత నా పిచ్చికి విస్తుపోయారు. వారంతా సామాన్లెక్కించుకుని రిక్షాలో వెళ్ళిపోయారు. నేను మాత్రం గొడుగు పట్టుకునే ఇంటికి నడిచాను.

మా అమ్మాయి పెళ్ళయిపోయింది. బంధువు లందరూ వెళ్ళిపోయారు. ఇల్లు ప్రశాంతంగా తయారైంది. నేను పెళ్ళికి పెట్టిన లీవు ఐపోయింది. ఆఫీసుకు బయల్దేరబోతూ వరండాలో కొచ్చాను. గొడుగు గుర్తొచ్చింది. "ఏమేవ్? గొడుగిలా పట్రా!" కేకేశాను. 'ఈ రోజెలాగైనా కొత్త బట్టల్లో దర్జాగా, కొత్త గొడుగు పట్టుకుని ఠీవిగా, ఆఫీసుకు వెళ్ళాలి. ఈ రోజు వాన తప్పక రావాలి. అందరి కంటే ముందే టీ త్రాగి రావాలి క్యాంటిన్ కెళ్ళి' అని ఆలోచిస్తున్నానేగాని, ఎంతకూ మా ఆవిడ గొడుగు తెచ్చివ్వలేదు. వంటింట్లో ఎవర్నో కేకలేస్తూంది. విసుగెత్తి నేనే వెళ్ళాను వంటింట్లోకి. మా అబ్బాయి, రెండో అమ్మాయి తప్పు చేసిన వాళ్ళలా తలొంచుకున్నారు. మా ఆవిడ తిడుతోంది వాళ్ళని. "బుద్ధి లేకపోతే సరి! ఎంతో కష్టపడి కొనుక్కున్నదాన్ని పరులపాలు చేశారు. మీకు మతి మరుపు ఎక్కువై పోతూంది" అని.

"ఏమిటే గొడవ? నేను గొడుగు తెమ్మంటూంటే!" అన్నాను మరీ విసుగ్గా.

"దాన్ని గురించేనండి నేనంటున్నది. నిన్న పెళ్ళికొడుకు తరపువాళ్ళు బలవంతం చేస్తే, అన్నా, చెల్లెళ్ళిద్దరూ వారితో పాటు సినిమా కెళ్ళారు. వాన వస్తుంటే మీ గొడుగు పట్టుకెళ్ళారు. అప్పటికీ నే చెప్పాను 'జాగ్రత్త'ని. అనుకున్నంతా చేశారు; సినిమాహాల్లో పెట్టి మర్చిపోయి వచ్చారు" అంటూ విసుగుతూ చెప్పింది.

అది విని నిలువునా నీరైయ్యాను ఏమీ మాట్లాడలేక.

# గుర్తుకు తెచ్చుకో నేస్తం

గుర్తుకు తెచ్చుకో నేస్తం
నీ తొలి స్పర్శకూ మలి స్పర్శకూ మధ్య
నేనెంత శూన్యతను ఎదుర్కొన్నానో
నిరీక్షణకు నిర్వచనం నాకు చెప్పకు.
నిద్రాణమైన తలపును తట్టి లేపకు
రెప్పపాటు కాలంలో
అనిర్వచనీయానుభూతులు.
పరిభ్రమిస్తున్న కాలానికి
ఎక్కడో ఎప్పుడో గండి పడచ్చు.
కోరికల విత్తనాలు మొలకలెత్తనూ వచ్చు
దృష్టి సోకినంత మేరా
తారకలు నమస్కరిస్తున్నాయి.
ఆతిథ్యం కోరి నిరీక్షిస్తున్నాయి.
గుర్తుంచుకో నేస్తం.
నేను
ప్రేమించ బడటాన్ని ప్రేమిస్తాను.
భావశూన్యతను భరిస్తూ
ప్రేమించబడటాన్ని ప్రేమిస్తాను.

— వాణీ రంగారావ్